క్లుప్తంగా

కళాశాలలో అన్నదానం



గోవిందరావుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలని విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మునిగాల వెంకన్న అతడి భార్య అన్నపూర్ణ జ్ఞాపకార్థం గురువారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లెక్చరర్లు వెంకన్న, కార్తీక్ రెడ్డి, హిమబిందు, రజియా, సతీష్, అనిత, శోభారాణి, సోమనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సిరెడ్డిని గెలిపించాలి

ఏటూరునాగారం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించాలని తెలంగాణ ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల ఉప్పస్వామి, పల్లె నాగరాజు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. టీఎస్ యుటీఎఫ్, టీపీటీఎఫ్ ఉమ్మడి అభ్యర్థిగా నర్సిరెడ్డి పోటీ చేస్తున్నారన్నారు. విద్యారంగంపై సంపూర్ణ అవగాహన కలిగిన ఆయనకు సంఘాలకు అతీతంగా మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

గ్రామ కమిటీ ఎన్నిక



చిట్యాల: మండలంలోని ఏలేటిరామయ్యపల్లి గ్రామంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్ ఆధ్వర్యంలో గురువారం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నగరి అశోక్, ఉపాధ్యక్షులుగా తుమ్మ మహేందర్, ఏలేటి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా రాజయ్య, కార్యదర్శిగా రవీందర్, కోశాధికారిగా ఉమ్మనవేని రాజు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్, రవీందర్ రావు, నవీన్, రాజు, నరేష్, దామెర రాజు, రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



భూపాలపల్లి రూరల్: పదవి కాలం పూర్తయిన పట్టణంలోని సుబాస్‌కాలనీలో 17 వార్డు మున్సిపాల్ కౌన్సిలర్ మురళి, కోఆప్షన్‌మెంబర్ బేతోజు వజ్రమణి–బీబీచారిలను కాలనీకి చెందిన జాంభవ కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. కాలనీ అభివృద్ధికి, కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి వారు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మచ్చ భద్రయ్య, కొడెపాక శంకర్, కలువల రాజమొగిలి, సుధాకర్, కుమార్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ప్రశాంతత

మల్హర్: యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని హాట్ ఫుల్ నెస్ జోనల్ కోఆర్డినేటర్ తీగల వెంకటరమణ అన్నారు. జిల్లా కోఆర్డినేటర్ చెరుకుపల్లి రవీందర్ ఆధ్యక్షతన మండలంలోని తాడిచర్ల గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఉచి త యోగా శిక్షణ తరగతులకు వెంకటరమణ హాజరై మాట్లాడారు. ప్రతీ మనిషి వివిధ రకాల ఆలోచనలతో నిత్యం సతమతమవుతారని, వాటి ద్వారా మానసిక శారీరక రుగ్మతలు తయారవుతాయన్నా రు. వాటిని పారద్రోలేందుకు యోగా, ధ్యానాలు దివ్య ఔషధంగా పనిచేస్తాయని తెలిపారు. యోగా శరీరానికి ఉపకరిస్తే ధ్యానం మనసును శుద్ధి చేస్తుందని తద్వారా శారీరక మానసిక రుగ్మతలు దూరమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ కో ఆర్డినేటర్ బొంగాని లక్ష్మణ్, భూపాలపల్లి సెంటర్ కోఆర్డినేటర్ చెరుకుపల్లి మాధవి, సాధకులు విష్ణు, అరుణ్, గంగాధరచారి, మాధవరెడ్డి, నరేష్, శ్రీనివాస్, సమ్మయ్య, మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన సిలివేరు లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ గురువారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే అనంతరం పత్తిపల్లి గ్రామానికి చెందిన గుండారపు ఉప్పలయ్య మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, కంబాల రవి, తిరుపతి, నాగరాజు, రాజన్న, అశోక్, సారయ్య, రఘు, ప్రతాప్, తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా గుంతలు



కన్నాయిగుడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రహదారిపై గంత



బుట్టాయిగూడెంలో ప్రమాదకరంగా ఉన్న గుంత

- మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటుకు తీసిన గుంతలు
- తూతూ మంత్రంగా పూడ్చివేత
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

కన్నాయిగూడెం: మిషన్ భగీరథ పైపులు వేయడానికి తీసిన గుంతలు ప్రయాణికులకు ప్రమాదకరంగా మారాయి. గతంలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో అధికారులు రోడ్డుకు అడ్డంగా తవ్వి పైపులను వేశారు. కానీ తీసిన గుంతలను పూడ్చడంలో అధికారులు పైపైనా పూడ్చి వదిలేశారు. వాహనాల రాకపోకలతో పైపులైన్ తవ్విన చోట గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలో పడి ప్రమాదాలకు గురైన సంఘటన చాలా ఉన్నాయి. ముఖ్యంగా మండలంలోని తుపాకులగూడెం నుంచి ఏటూరునాగారం వరకు ఉన్న ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. అలాగే గ్రామాల్లోని అంతర్గత రోడ్ల పరిస్థితి మరి దారుణం. రోడ్లను మొత్తం తవ్వడంతో అధ్వానంగా ఉన్నాయి. రాత్రి సమయంలో ప్రయాణించినప్పుడు గుంతలు కనిపించక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లను మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



రోడ్లపై భగీరథ పైపుల కోసం తీసిన గుంతలతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రయాణం చేసే సమయంలో గుంతలో పడి ప్రమాదాల బారిన పడుతున్నాం. చాలా మంది ద్విచక్రవాహనాల పైనుంచి పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లను మరమ్మతు చేయించాలి

– కాటమ్‌రెడ్డి, ముప్పనపల్లి యువకుడు

మరమ్మతులు చేస్తాం..

మండలంలో రహదారిపై తీసిన మిషన్ భగీరథ గుంతలను మరమ్మతు చేస్తాం. మిషన్ భగీరథ అధికారులకు చాలా సార్లు తెలిపిన వారు స్పందించడం లేదు. గతంలో పూడ్చినం కానీ మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. గుంతలను వెంటనే పూడ్చే విధంగా చొరవ తీసుకుంటాం.

– రఘువీర్, ఆర్అండ్‌బీ డీఈఈ

మహాత్మా గాంధీకి ఘన నివాళి



గోవిందరావుపేట: చల్వాయిలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అశోక్

ములుగు రూరల్: మహత్మగాంధీ వర్ధంతిని జిల్లా కేంద్రంలో గురువారం డీవైఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. గాంధీ ఆశయాలను కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండి గఫూర్, కలువల రవిందర్, దేవేందర్, ముత్యాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: అహింసామార్గంతో ఎంతటి కఠినమైన లక్ష్యాన్నైనా సాదించవచ్చు అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. మండల పరిధిలోని చల్వాయి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో మహాత్మగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వాజేడు: మహాత్మా గాంధీ వర్ధంతిని వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించారు. స్థానిక వైద్యశాల ఆవరణలో గాంధీ చిత్రపటానికి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయ, ఎంఈఓ వెంకటేశ్వర్లు, వైద్యులు మహేందర్, మధుకర్, కోటి రెడ్డి, వైద్య సిబ్బంది పూల మాలలు వేసి నివాళులర్పించారు.



వాజేడు: పూల మాల వేస్తున్న తహసీల్దార్



ములుగురూరల్: పూలమాల వేస్తున్న నాయకులు

నిరుపేదలకు ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

- రోడ్డు రవాణాశాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్

ఏటూరునాగారం: నిరుపేదలకు ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని రోడ్డు రవాణాశాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. గురువారం మండలంలోని ముళ్లకట్ట గ్రామంలోని నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయడంతో సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ సభలో అర్హులను స్వయంగా ప్రజల సమక్షంలో ప్రజా నిర్ణయం ద్వారా ఎంపిక చేశామన్నారు. పదేళ్ల తరువాత తొలిసారిగా రేషన్ కార్డులు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకన్న, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ అయూబ్ ఖాన్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, దేవులపల్లి విజయ్ కుమార్, జిల్లా యూత్ కార్యదర్శి ఎండీ గౌస్, సరికొప్పుల శ్రీనివాస్, డొంగిరి మధు, ఉమ్మగాని రమేష్, జనార్ధన్ పాల్గొన్నారు.



సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి లేదు

- మండల అధ్యక్షుడు అప్సర్ పాషా

కన్నాయిగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అప్సర్ పాషా అన్నారు. మండలంలోని బుట్టాయిగూడెంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పని చేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే అధికారం బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. కావాలని కొందరు పనికొట్టుకొని విమర్శకు దిగుతున్నారన్నారు. పది సంవత్సరాలు పాలించన బీఆర్ఎస్‌కు అప్పుడు ప్రజలు గుర్తుకు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జీ జాడి రాంబాబు, తాటి రాజబాబు, యువజన సంఘం ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం బైరేష్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యాయుడు అబ్బు రమేష్, నాగేష్, సాంబశివరావు, సుమన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్సర్ పాషా

దుప్పట్లు, ఆటబొమ్మల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న ఎస్సై తిరుపతిరావు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీరభద్రవరం, పాత్రాపురం, ఉప్పేడు, వీఆర్‌కేపురం, వీరాపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1000 విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు, జంతికలు, ఆటబొమ్మలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సై కొప్పుల తిరుపతి హాజరై విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. చదువు నేర్పిన గురువులకు, తల్లితండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మురళీధర్ రెడ్డి, సతీశ్, జ్యోతి, రాజేశ్ ఉన్నారు.

అమల్లోకి ఎన్నికల కోడ్



వెంకటాపురం(కె): విగ్రహానికి ముసుగు వేస్తున్న సిబ్బంది



ఏటూరునాగారం: బ్యానర్లను తొలగిస్తున్న సిబ్బంది

ఏటూరునాగారం: గ్యాడ్యుయేషన్, టీచర్స్ ఎమ్మెల్సీ నోటిఫికేషన్ ఈనెల 29 ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను గురువారం తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి రమాదేవి తెలిపారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు సైతం ముసుగులు వేయడం జరుగుతుందన్నారు.

వెంకటాపురం(కె)లో..

వెంకటాపురం(కె): ఖమ్మం, వరంగల్, నల్లగొండ శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఎన్నికల కోడ్‌ను నేటి నుంచి అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఆధ్వర్యంలో సిబ్బంది రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు.

జీతాలు చెల్లించాలని వినతి

టేకుమట్ల: మూడు నెలలుగా జీతాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని చెల్లించాలని కోరుతూ.. ఇన్‌చార్జ్ ఏపీఓ వినీల ఆధ్వర్యంలో ఎంపీఓకు ఉపాధి హామీ సిబ్బంది గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం విజయవంతం కావాడానికి ఈజీఎస్ సిబ్బంది ఇబ్బందులు పడి పని చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం చొరవ తీసుకుని జీతాలు చెల్లించాలని కోరారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత



కన్నాయిగూడెం: ప్రధాన రహదారిపై ర్యాలీ తీస్తున్న వైద్యులు



వాజేడు: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

- వైద్యుడు అభినవ్

కన్నాయిగూడెం: కుష్ఠు వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని వైద్యుడు అభినవ్ అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్న బోయినపల్లి సబ్ సెంటర్‌లో డాక్టర్ అభినవ్ లెప్రసి అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేసి ప్రధాన కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది రావిష్, రమణకుమారి, చిన్నబోయినపల్లి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్‌రావు, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, లక్ష్మణ్, సమ్మక్క, పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి

వాజేడు: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యులు మధుకర్, మహేందర్ అన్నారు. గురువారం కుష్ఠు వ్యాధి గుర్తింపు కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించడంతో పాటు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోధుమ రంగు మచ్చ, స్పర్శ లేకుండా ఉండటం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సకాలంలో వైద్యం చేయడం మూలంగా అంకవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయ, ఎంఈఓ వెంకటేశ్వర్లు, డీపీఎంఓ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు కోటిరెడ్డి, వెంకట రమణ, వైద్య సిబ్బంది నాగేంద్ర కుమారి, లలిత కుమారి, అనూష, చిన్న వెంకటేశ్వర్లు, శేఖర్, ఆశకార్యకర్తలు ఉన్నారు.

ఆశవర్కర్లకు పథకాలు వర్తింపజేయాలి



అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీకి వినతిపత్రం అందిస్తున్న ఆశవర్కర్లు

ములుగు రూరల్: ఆశవర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశవర్కర్లను ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ స్కీం కింద నియమించారని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించలేదని అన్నారు. ఆశవర్కర్లు పారితోషికాల పద్ధతిలో గ్రామీణాప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. అర్హులైన ఆశాలకు ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్, తదితర సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశాల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నీలాదేవి, మంజుల, రమాదేవి, కవిత, సంధ్య, ఈశ్వరి, రజిత, సౌజన్య, శోభ, వాణి, సరోజన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

భూపాలపల్లిరూరల్: ఇటీవల బీహార్ రాజధాని పాట్నాలో నిర్వహించిన జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో జిల్లా ప్రభుత్వ పాఠశాల, మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొని విజయం సాధించారు. దీంతో విజయం సాధించిన వైష్ణవి, అంజలి, రుజ్దానైమా, హాసినిలను జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యనారాయణారావు గురువారం అభినందించారు. అలాగే తెలంగాణ టీంకోచ్‌గా వ్యవహరించిన పెద్దాపూర్ జెడ్పీస్కూల్ పీటీ కూస మమతను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో సైక్లింగ్ జిల్లా అసోసియేషన్ జిల్లా స్పోర్ట్స్ అధికారి చిర్ర రఘు, సైక్లింగ్ జిల్లా అసోసియేషన్ సెక్రటరీ చాగంటి ఆనంద్, కోశాధికారి సాంబరాజు తదితరులు ఉన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం



కన్నాయిగూడెంలో..



వెంకటాపురం(కె)లో..

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం ఇస్మరించిందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. హామీలను అమలు చేయాలని కోరుతూ గరువారం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల మహాత్మా గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను గాలికి వదిలేసిందని ఆరోపించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఏటూరునాగారంలో..



ఎస్ఎస్ తాడ్వాయి: గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పుస్తకావిష్కరణ

గోవిందరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు భూక్య జంపన్న అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాగణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 420 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇచ్చిన 420 హామీల పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను త్వరగా నెరవేర్చాలని తెలిపారు. ఈ మేరకు గాంధీ చిత్రపటానికి వినతి పత్రాన్ని సమర్పించాం అన్నారు. సూడి శ్రీనివాస్ రెడ్డి, స్వరూప, ఆలూరి శ్రీనివాస్ రావు, గట్టయ్య, దేవా, హేమాద్రి, చందులాల్, రేండ్ల శ్రీనివాస్, ఊట్ల మోహన్, ఫకృద్దీన్, మల్లేష్ గౌడ్, ఇంద్రా రెడ్డి, ఇకొండ శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, బిక్కు, గాంధీ, వెంకన్న, రాజాలు, రమేష్, ధర్మయ్య, శ్యామల్, పూర్ణచందర్, సుధాకర్ పాల్గొన్నారు.



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

చిట్యాల: ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను చేయడం సరికాదని త్రీవంగా ఖండిస్తున్నామని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లకొండ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గద్దర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్ర కిరణ్, నాగరాజు, రాజు, వెంకటేష్, శ్రీకాంత్, రమణకుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944